# ఐదు నక్షత్రాల వెలుగు

సమయం సాయంత్రం ఆరవుతోంది. చలికాలం... నవంబరు నెల... కార్తీకమాసం... ఆ రోజు ఏకాదశి. అది హైదరాబాద్‌లో అత్యంత ధనికులుండే జూబ్లీహిల్స్ ప్రాంతం. విశాలమైన ఖాళీస్థలంలో కొత్తగా కట్టిన ఐదు నక్షత్రాల హోటల్ ప్రారంభోత్సవం జరుగుతోంది ఆ రోజు. అసలే అందమైన కట్టడం... అలంకారాలతో మరింత అందంగా అలరారుతోంది. పూలదండలతో, రంగు రంగుల బల్బుల తోరణాలతో, రకరకాల బెలూన్లతో అలంకరించిన ఆ బిల్డింగ్ దానిముందు ఉన్న లాన్‌లో మొక్కలకు అలవోకగా అలంకరించిన సీరియల్ బల్బులు... ధగధగ లాడిపోతోంది. ఎత్తుగా, బలంగా కట్టిన ఖరీదైన గేటు నుంచి మరో నాలుగు అపార్ట్‌మెంట్స్ కట్టడానికి వీలున్నంత ఖాళీ స్థలం... అందులో సగం అందమైన లాన్... రెడీమేడ్ మొక్కలు, ఇత్తడి కుండీల్లో క్రోటన్స్... లాన్ మధ్యలో ఫౌంటెన్లు... లోపలంతా అందమైన షాండ్లియర్స్, అద్భుతమైన ఇంటీరి యర్ డెకరేషన్. అపూర్వంగా హైదరాబాద్‌లో నెంబర్‌వన్ స్థానాన్ని ఆక్రమించేలా ఉందా హోటల్.

***

మెయిన్ గేటులోంచి ఖరీదైన కార్లు ప్రవేశించి పార్కింగ్ ప్లేస్ వైపు వెళ్తు న్నాయి. అవన్నీ నగరంలో ప్రముఖులుగా పేరుగాంచిన బడా బాబుల కార్లు. యూనిఫామ్‌లో ట్రిమ్‌గా ఉన్న వెయిటర్స్ అటూ, ఇటూ తిరుగుతున్నారు హడావు డిగా. లాన్‌లో గుండ్రంగా వేసిన కుర్చీలు, మధ్యలో గుండ్రటి టేబుల్స్, వాటిపైన చక్కని ఫ్లవర్‌వాజ్‌లు... పూగుత్తుల్లా తయారుచేసి గాజుగ్లాసులో అమర్చిన పేపర్ నాప్‌కిన్స్, పెద్దపెద్ద ప్లేటుల్లో చక్కగా పద్ధతిగా పెట్టిన స్పూనులు, ఫోర్కులు... బాగా ఎత్తుగా కట్టిన వేదిక మీద ఆర్కెస్ట్రా గ్రూపు ప్రారంభించబోయే కార్యక్రమానికి సన్నాహాలు చేసుకుంటోంది.

బైట మెయిన్ గేటుకి కుడిపక్క కొంచెం దూరంలో ఒక పెద్ద వేపచెట్టు ఉంది.

దానికింద ఐదుగురు వ్యక్తులు కూర్చుని ఉన్నారు. వాళ్ల వయసు సుమారు 45, 46 ఉంటుంది. కానీ, రావాల్సిన దానికన్నా ముందే వృద్ధాప్యం వాళ్లని ఆవరించినట్టు ఉన్నారు. వాళ్లకున్న బట్టల్లో కొంచెం పరిశుభ్రంగా ఉన్న బట్టలేసు కున్నారు. వాళ్ల మోచేతులు, మోకాళ్లు సిమెంటు పని, మట్టిపని చేసిచేసి బండబారి పోయి, గరుకుగా, పొడిబారి ఉన్నాయి. వాళ్లు లైట్ల వెలుగులో ధగధగలాడుతోన్న ఆ హోటల్ వైపు తృప్తిగా, ఆనందంగా చూస్తున్నారు. వాళ్ల కళ్లల్లో ఆ హోటల్ కట్టడంలో తాముపడిన శ్రమ, కష్టం కంట్రాక్టర్ కరుకుదనం అన్నీ సన్నగా మెదుల్తున్నాయి. అయినా ఏదో సంతృప్తి, ఏదో సాధించామన్న విజయం కనిపి స్తోంది. ఈ అందమైన హోటల్ కట్టిన చేతులు ఇవేనా? అనుకుంటున్నట్టుగా వాళ్ల చేతుల వైపు చూసుకున్నారు. ఆ తరువాత ఒకళ్ల మొహాలు ఒకళ్లు చూసు కున్నారు. వాళ్ల పెదవులపైన చిన్న చిరునవ్వు కదిలింది.

"ఏరా ఎంకయ్యా మనల్ని పిలుస్తారంటావా?" అడిగాడో వ్యక్తి.

"ఈడికన్నీ అనుమానాలే... పునాదులేసినోల్లం... రాయేసినోల్లం... మట్టేసినోల్లం... ఇయాల ఈ బిల్డింగు ఇంత పెద్దగై, ఇంతమంది సార్లు ఈడికొచ్చి రంటే మన కష్టం కదరా... మనకి అన్నదానం చేయందే. ఇంకెవరికీ చేయకూడ దని ఆ సార్లకి తెలుసు. తప్పకుండా మనల్ని పిలుస్తారు. కాకుంటే జరసేపు ఓపిక పట్టాలె" అన్నాడు మరోవ్యక్తి.

"గుత్తేదారు రమ్మన్నాడని కదా వచ్చినం... ఇయాల ఒటేలు పారంబం... రాండిరా మిఠాయిలిస్తరు. మీకు ఇనామిస్తరు అని అన్నడనే కదా..."

"గది నిజమే కానీ, గుత్తేదారు కనబడలే కదా..."

"ఉంటడు యాడనో లోపల... జర ఓపిక పట్టాలె...'

వాళ్లలా మాట్లాడుకుంటుండగానే పరిసరాలను చైతన్యపరుస్తూ ఆర్కెస్ట్రా మొదలైంది. ఐదుగురూ కూర్చున్న చోటునుంచి లేచి గేటు దగ్గరగా నడిచారు. గేటు బైట కొంచెం దూరంలో నిలబడితే ఆర్కెస్ట్రా వాళ్లున్న వేదిక కనిపిస్తుంది. కొత్త సినిమాల్లో పాటలతో గాయనీ, గాయకులు పాటకు అనుగుణంగా వేదిక మీద డాన్సులు చేస్తూ వేదికని అదర గొడుతున్నారు. కార్లలో వచ్చిన ఖరీదైన బాబులంతా పరస్పర పరిచయాలతో కరచాలనాలు చేసుకుంటూ మధ్య,మధ్య వేదిక వైపు చూస్తూ హోటల్ మొత్తం చూడడానికి లోపలికి వెళ్లి వస్తున్నారు. వాళ్లంతా కళ్లు తిప్పుకోకుండా హోటల్‌ని పరిశీలించడం గమనించిన ఆ కూలీల గుండెల్లో ఆనందం వెల్లివిరిసింది.

ఇంత అందమైన ఈ హోటలు ఎవరు కట్టారు అని వాళ్లు అడిగుంటారు. తప్పకుండా తమ పేర్లు వాళ్లకి గుత్తేదారన్నా హోటల్ యజమానులన్నా చెప్పి ఉంటారన్న గట్టి నమ్మకం వాళ్ల మనసులో పడింది.

అడుగడుగునా కళాత్మకత ఉట్టిపడేలా చెక్కిన గోడలు, ఆ చెక్కటంలో కోసుకు పోయిన మోచేతులు... కాళ్లకు అయిన గాయాలు, కళ్లల్లో పడిన సిమెంట్ రేణువులు... మండిన కళ్లు.. రాత్రి ఇంటికి వెళ్లాక భార్యలు కళ్లల్లో పోసిన చల్లని పాలు... అన్నీ గుర్తొస్తున్నాయి.

"అరే రోజు కూలీ వస్తుంది కదా అని సంవత్సరాలకు సంవత్సరాలు చేయరు కద... ఖచ్చితంగా రోజూ వచ్చి పనిచేయండి. పన్నెండు గంటలు పనిచేయ కుంటే కూలీ కోస్త..." గుత్తేదారు వార్నింగులు. మధ్యమధ్య కొందరు చిన్న కూలీలు రాకపోతే ఆ పని కూడా తమ చేతే చేయించిన అతని కాఠిన్యం... అన్నీ గుర్తొస్తు న్నాయి.

నిజం చెప్పాలంటే ఈ బిల్డింగు కట్టడానికి సిమెంటులో నీటికన్నా తమ చెమటే ఉపయోగించారు. అందుకేనేమో అంత దృఢంగా ఉందా బిల్డింగు అనిపి స్తోంది వాళ్లకి.

తాను నాటిన మొక్క ఎదిగి పెద్ద చెట్టై బోలెడన్ని ఫలాలిచ్చినప్పుడు ఆ తోటమాలికి కలిగే ఆనందం, తొమ్మిది నెలలు మోసి కన్నబిడ్డ పెద్దవాడై వృద్ధిలోకి వచ్చినప్పుడు తల్లి పొందే సంతోషం ఇప్పుడా ఐదుగురూ పొందుతున్నారు. తమ చేతుల్లో రూపుదిద్దుకున్న ఆ హోటల్ ఎంతో అందంగా కళ్లముందు కనిపిస్తోంటే, ఖరీదైన ఫర్నిచరుతో, తివాచీలతో మిగతా అలంకారాలతో, విద్యుద్దీపాలతో దేదీప్య మానంగా వెలిగిపోతోంటే ఒక్కసారి లోపలికి వెళ్లి చూడాలన్న ఉబలాటం చిన్నగా మొదలైంది అందరికీ.

"ఒరేయ్ సిద్ధయ్యా... ఓసారి లోనకెల్లి చూద్దామారా..." అడిగాడు ఎంకటయ్య.

"పోవచ్చునో లేదో" దిగాలుగా అన్నాడు సిద్ధయ్య.

"రానిస్తరో లేదో" అన్నాడు శీనయ్య.

"అరె ఎందుకు రానియ్యర్రా... మనం కట్టిన ఒటేలది... మనల్నెందుకు రానియ్యరు... ఇల్లు కట్టినప్పుడు గృహప్రవేశం చేసి, మనల్ని కూడా పిలుస్తరు కదా బైట సార్లు... ఒటేలుకెందుకు పిలవరు... నడువుండ్రి పోదాం" అన్నారు

శంకరయ్య, పోచయ్య.

"పోదామా? ఏం కాదా?" ఆశగా, అనుమానంగా అడిగాడు శీనయ్య. అతనికి లోపలికెళ్లి ఒక్కసారి ఆ గోడలు చేత్తో తాకాలని ఉంది. నిలువెత్తు అద్దాల్లో తనని తాను చూసుకోవాలని ఉంది. నీడలారే ఫ్లోరింగ్ మీద తన నీడ చూసుకోవాలని ఉంది. ఆకాశాన్ని తాకుతున్నట్టున్న ఆ హోటల్ పైకెళ్లి ఒక్కసారి చేత్తో అందితే ఆకాశాన్ని అందుకోవాలని ఉంది.

ఇంతలో వరసగా నాలుగు ధగధగలాడే కార్లు వచ్చాయి. ఆ కార్లను చూసిన కొంతమంది పెద్దవాళ్లు హడావుడిగా కార్లకు ఎదురెళ్లారు. కార్లలో నుంచి అందమైన అబ్బాయిలు, అమ్మాయిలు దిగారు. వాళ్లని చూసిన ఆర్కెస్ట్రా ఊపందుకుంది.

"అరేయ్... చిరంజీవిరా... చిరంజీవి వచ్చిండు... నడవండిరా పోదం... చిరంజీవిని చూద్దాం... అదిగో జయప్రద... అరె."

"ఆమె శ్రీదేవి కాదూ, అరే రాండిరా" అందరికన్నా సినిమాలు ఎక్కువగా చూసే శీనయ్య ఉత్సాహంగా అరిచాడు.

"అవునురోయ్... వాళ్లు సినిమావాళ్లే... చిరంజీవి వచ్చిండురోయ్..." అన్నాడు సిద్ధయ్య.

"పదండిరా పోదాం... ఐదుగురూ ఆపుకోలేని ఉత్సాహంతో మెయిన్ గేటు దాటి లోపలికి వెళ్లబోతుంటే చేతులు అడ్డంగా పెడుతూ వచ్చారు ముగ్గురు బలంగా ఉన్న గేట్ కీపర్లు.

"ఏయ్... ఎక్కడికిరా... నడవండి బైటకి... కనిపించడంలేదా.. పెద్దపెద్ద వాళ్లున్నారు లోపల. ఎక్కడికి వస్తున్నారు?" అదిలిస్తూ వాళ్లని నెట్టేయబోతుండగా అన్నాడు ఎంకటేశు... "మేమే గీ హోటల్ కట్టినోల్లం..."

"అయితే... మీ పేరు మీద రాసిచ్చాడా సారు... ఎక్కువ మాట్లాడకుండా పొండి... నడవండి బైటకి..." వాళ్లని తోస్తూ మెయిన్ గేటు బైటకి తీసుకొచ్చాడు.

వాళ్లందరికీ కోపం వచ్చింది. దుఃఖం వచ్చింది. రోషం వచ్చింది. కానీ, ఏదీ ప్రదర్శించలేని నిస్సహాయతతో గేటు బైట ఆశగా, ఆసక్తిగా, ఓపిగ్గా అలా నిలబడి మెరిసిపోతున్న హోటల్ అందాలను, కనిపించీ, కనిపించకుండా అలా కనిపించి ఇలా మాయమైన సినీతారలను కాళ్లు ఎత్తి వేళ్ల మీద నిలబడి కాసేపు కాంపౌండ్ వాల్ మీద నుంచి మెడ ఎత్తి కాసేపు, వాచ్‌మాన్ చూడనప్పుడు

గేటుకి దగ్గరగా వెళ్లి కాస్సేపు చూస్తూ నిలబడ్డారు.

కొన్ని నిమిషాలు గడిచాక హఠాత్తుగా ఆర్కెస్ట్రా ఆగిపోయింది. సూటు, బూటు వేసుకున్న మగవాళ్లు, ఆధునికంగా ఖరీదైన చీరలు, నగలతో తయారైన ఆడవాళ్లు గుంపుగా చేరగా వాళ్లను జరగమని చేతుల్తో సైగ చేస్తూ చేతిలో కెమెరాలతో విలేకరులు, వాళ్ల కెమెరాలని క్లిక్, క్లిక్‌మనిపిస్తుంటే ఆ మెరుపుల వెలుగుల్లో చిరునవ్వుతో, ఠీవిగా రిబ్బన్ కట్‌చేసి హోటల్ ప్రారంభం చేశాడు వాళ్ల అభిమాన హీరో... చప్పట్లు మారుమోగాయి.

అప్రయత్నంగా ఆ పది చేతులు చప్పట్లు కొట్టాయి. ఆనందంతో వాళ్ల గుండెలు ఎగిరెగిరి పడ్డాయి. మేము కట్టిన హోటల్ మా హీరో ప్రారంభించాడు. కాస్సేపు వాళ్ల మనసుల్లో గర్వం తొణికిసలాడింది. గుంపు చెదిరింది... చేతిలో కెమెరాలతో విలేకర్లు, వీడియోగ్రాఫర్లు ఆ హీరోని వెంబడిస్తూ హోటల్ లోపలికి వెళ్లారు. మిగతావాళ్లంతా వాళ్లని అనుసరించారు.

వీడియో హోటల్లోని ప్రతి అణువునీ కెమెరాల్లో బంధిస్తోంది. ఆ కట్టడానికి, దానికి తగ్గట్టుగా అలంకరించిన ఫర్నిచర్‌ని, ఇంటీరియర్ డెకరేషన్‌ని పొగుడుతోంటే హోటల్ యజమాని పొంగిపోతున్నాడు. ఆయన హైదరాబాద్‌లో ఉన్న సంపన్నుల్లో మూడోవ్యక్తిగా పరిగణించబడినవాడు. పొలిటికల్ పవర్ ఉన్నవాడు. అతని వెనకాలే ఆ హోటల్ కంట్రాక్ట్ పొందిన కంట్రాక్టర్ వినయంగా పెంపుడు కుక్కలా తిరుగుతున్నాడు. మళ్లీ ఆయన చేయబోతున్న మరో వెంచర్‌కి తానే కంట్రాక్ట్ అందుకోడానికి తనవంతు పైరవీ కృషి చేస్తున్నాడు.

పలచబడిన ఆవరణలో ఆ ఐదుగురి కళ్లు ఆ కంట్రాక్టర్ కోసం గాలిస్తున్నాయి. అతను కనిపిస్తే తప్పకుండా తమని లోపలికి తీసికెళ్తాడన్న ఆశ వాళ్లల్లో మెదుల్తోంది.

కొద్దిసేపట్లో అందరూ బైటికి వచ్చి లాన్‌లో గుండ్రంగా వేసిన కుర్చీల్లో కూర్చున్నారు. మళ్లీ యథాప్రకారం ఆర్కెస్ట్రా మొదలైంది.

లోపల్నించి వెయిటర్స్ రకరకాల ఆహార పదార్థాలు తీసుకొస్తూ టేబిల్స్ మీద పెడుతున్నారు. డ్రింక్ చేసేవాళ్లు, భోంచేసేవాళ్ళు... కబుర్లు చెప్పుకుంటున్న వాళ్లు... సినీతారలతో ఫొటోలు తీయించుకుంటున్న వాళ్లు...

ఆ కమ్మటి వంటల సువాసనలు గాలిలో తేలి మెయిన్ గేటు దాకా వచ్చి ఆ ఐదుగురి నాసికా పుటాలను తాకాయి. అప్పటిదాకా అణచిపెట్టిన ఆకలి విజృంభించింది. ఇప్పుడు వాళ్ల కళ్లు గుత్తేదారు కోసం వెతకడం ప్రారంభించాయి.

అతను కనక తమల్ని చూస్తే తప్పకుండా లోపలికి తీసికెళ్లి కమ్మటి వంటలతో, తీపిపదార్థాలతో, ఖరీదైన ఐస్‌క్రీమ్‌తో కడుపు నిండా తిండి పెట్టిస్తాడన్న ఆశ... విశ్వాసం... అలా ఎదురుచూడడంలో వాళ్లకి సమయం తెలియలేదు. లైట్ల ధగ ధగల్లో బాగా చీకటి పడిపోయిందని అర్థం కాలేదు. నెమ్మది, నెమ్మదిగా కార్లు వెళ్లిపోతున్నాయి. జనం పల్చబడ్డారు. రాజకీయ నాయకులు, సినిమా తారలు అంతా వెళ్లిపోయారు. మిగతా అతిథులు కూడా దాదాపు వెళ్లిపోయారు.

"అదుగోరా మన సారు" గట్టిగా అరిచాడు సిద్ధయ్య.

ఐదుగురూ ఆశగా, ఆదుర్దాగా చూశారు. ఖరీదైన సూటులో ఉన్న వ్యక్తితో మాట్లాడుతూ కంట్రాక్టర్... ఆ సూటువాలానే హోటల్ యజమాని సుధీర్‌కుమార్.

ఐదుగురూ ఇంక ఒక్క క్షణం ఆలస్యం చేయలేదు. ఎక్కడలేని శక్తితో పరుగుపెట్టారు. ఆగండి, ఆగండి అంటూ గేటు కీపర్లు వెంటపడుతున్నా కాళ్లల్లో అంత శక్తి ఎలా వచ్చిందో ఐదుగురూ ఆయాసపడుతూ కంట్రాక్టర్‌ని చేరి ఏక కంఠంతో 'సార్' అని పిలిచారు.

సుధీర్‌తో సహా కంట్రాక్టర్ కూడా ఉలిక్కిపడి చూశాడు. లైట్ల వెలుగులో వెలిసిపోయిన పాతగోడల్లా కనిపించారు వాళ్లంతా... "ఏంట్రా"... ఎప్పుడు వచ్చారు? "చాలా ప్రేమగా అడుగుతూ సుధీర్‌తో చెప్పాడు "వీళ్లు కూలీలు సార్... ఏదో పాపం ఇనాం ఆశిస్తున్నారు" అంటూ వెనకాలే పరిగెత్తుకొచ్చిన గేటుకీపర్‌తో అన్నాడు "వీళ్లకి ఏమన్నా స్వీట్స్ ఉంటే ఇచ్చెయ్యండి. కూలీలు కదా... వాళ్లకి తప్పకుండా పెట్టాలి. పొండిరా... లోపలికి వెళ్లకండి. దూరంగా ఉండండి" అంటూ ముందుకు నడిచాడు. సుధీర్‌కుమార్‌తో కలిసి అతని కారు దగ్గరకు వెళ్తొన్న కంట్రాక్టర్‌ని నిర్ఘాంతపోయి చూస్తూ ప్రతిమల్లా నిలబడ్డ ఆ ఐదుగురి చేతుల్లో పేపర్ ప్లేట్స్‌లో కట్టిన ఐదు బాదం బర్ఫీ ముక్కలు, ఐదు జీడిపప్పులు తీసుకొచ్చి ఇంద... తీసుకెళ్లండి అంటూ వాళ్ల చేతుల్లో కుక్కి వాళ్ల భుజాలు పట్టుకుని మెయిన్ గేటు దాకా తీసుకొచ్చి బైటికి నెట్టారు గేట్‌కీపర్లు.

ఏం జరుగుతోందో వాళ్ల మెదడు గ్రహించేలోపల అప్పటిదాకా హోటల్ ఆవరణలో దేదీప్యమానంగా వెలుగుతోన్న లైట్లు ఒక్కొక్కటే ఆరిపోవడం ప్రారంభించాయి.

***

*(మే 18 2011, నవ్య)*